## డాక్టరేట్ అవార్డు గ్రహీత రేవల్ల మదన్‌కు ఘన సన్మానం



**దశ, హయత్‌నగర్ :** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హయత్‌నగర్‌లోని పుల్లారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ స్కూల్‌లో ప్రముఖ సంఘ సేవకుడు, ట్రీస్ సొసైటీ చైర్మన్ రేవల్ల మదన్‌కు ఘన సన్మానం నిర్వహించారు. ఇటీవల డాక్టరేట్ అవార్డు అందుకున్న సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, మిత్ర బృందం సమక్షంలో ఆయనను సత్కరించారు. పుల్లారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్, ప్రముఖ ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి చేతుల మీదుగా రేవల్ల మదన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గుడాల సందీప్ ముదిరాజ్, గన్నోజి శివకుమార్, కే. ఆనంద్ కుమార్, గుర్రం శ్రీనివాస్ రెడ్డి, మహేష్ గౌడ్, టీ. మల్లేష్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, మిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

## రెడ్డి జాగృతి జాతీయ గౌరవ అధ్యక్షుడిగా భుజంగ రెడ్డి



**దశ, వనస్థలిపురం:** రెడ్డి జాగృతి జాతీయ గౌరవ అధ్యక్షుడిగా వనస్థలిపురానికి చెందిన సంరెడ్డి భుజంగ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రెడ్డి జాగృతి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టంగారి మాధవ రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా భుజంగ రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి కుటుంబ సభ్యుల అభ్యున్నతికి తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి జాతీయ గౌరవ అధ్యక్షుడిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి కృషి చేసిన రెడ్డి జాగృతి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మాధవ రెడ్డి, జాతీయ అధ్యక్షుడు ఉప్పల రెడ్డి, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రెడ్డి జాగృతి ఆశయాల సాధనకు, రెడ్డి కుటుంబ సభ్యుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని భుజంగ రెడ్డి పేర్కొన్నారు.

## ఉస్మానియా వర్సిటీలో ఘనంగా జన్మాష్టమి వేడుకలు

*వేడుకల్లో పాల్గొన్న డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గండికోట విజయ్‌కుమార్*




**దశ ఓయూ:** ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థి సంఘాల ఆహ్వానం మేరకు తార్నాక డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గండికోట విజయ్‌కుమార్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. వేడుకల్లో భాగంగా ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో విద్యార్థులు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. యువజన నాయకులు వీరబాబు, ప్రవీణ్, నితీష్, రామ్‌చరణ్, గోపి, దేవా గుణ, భరత్, రవి, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు సమాజానికి దిశానిర్దేశం

❖ *ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి.*



**దశ, రంగారెడ్డి :** ఉపాధ్యాయుల సేవలు సమాజానికి దిశానిర్దేశం చేస్తాయని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యారంగంలో విశేష సేవలందించిన ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, క్రమశిక్షణతో పాటు వారి భవిష్యత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జరుపుకునే ఉపాధ్యాయ దినోత్సవం.. ఉపాధ్యాయుల సేవలను గుర్తుచేసుకునే గొప్ప సందర్భమన్నారు.

ప్రస్తుతం కొంతమంది విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మాదక పదార్థాల వినియోగం వైపు ఆకర్షితులవుతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని మల్రెడ్డి రంగారెడ్డి అన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో వచ్చే మార్పులను ఉపాధ్యాయులు నిశితంగా గమనిస్తూ, వారితో నిరంతరం మాట్లాడి మాదక పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడటంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు, సమాజం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో బాధ్యతాయుత ప్రవర్తన, మంచి విలువలు, దేశభక్తి పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని అభినందించిన ఎమ్మెల్యే.. వారి సేవలు ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన బాధ్యతను మరింత అంకితభావంతో కొనసాగించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ అంటే పేదల సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వం

❖ *గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా పేదల పొట్ట కొట్టింది: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి*

**దశ, అబ్దుల్లాపూర్‌మెట్ :** కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని వైఎస్ఆర్ గార్డెన్స్‌లో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయకుండా వారి సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల అవసరాలను గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించే దిశగా చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుడెబల్లూర్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

❖ *వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు.. ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమం*

**దశ ఓయూ:** కృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని గుడెబల్లూర్ గ్రామంలో శనివారం వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ శ్రీ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి విద్యార్థినీ విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల తదితర వేషధారణలతో కోలాటం ఆడుతూ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు ఉట్టి కొట్టే ప్రాంగణానికి చేరుకుంది. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. కార్యక్రమంలో గుడెబల్లూర్ సర్పంచ్ మహాదేవమ్మ, ఉపసర్పంచ్, మాజీ ఎంపీటీసీలు, కరస్పాండెంట్ బి. నర్సిములు, అధ్యక్షుడు ప్రహ్లాదరెడ్డి, పేరెంట్ కమిటీ అధ్యక్షుడు పూజారి లక్ష్మణ్, మాగనూర్ మార్గదర్శి విద్యాలయ ప్రిన్సిపల్ ప్రసాద్‌రెడ్డి, గుడెబల్లూర్ మార్గదర్శి ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ భీమ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్రీలత, ఉపాధ్యాయులు రేణుక, చైతన్య, వర్ష, భవాని, మహేశ్వరి, నిఖిత, నాగమ్మ, నవీన్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్, సురేష్‌తోపాటు పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## ఫిర్జాదిగూడలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

❖ *సనాతన ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి: కన్నెబోయిన రాము యాదవ్*

**దశ ఓయూ:** ఆర్కే యువ భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ కన్నెబోయిన రాము యాదవ్ నేతృత్వంలో ఫిర్జాదిగూడ వినాయక్‌నగర్ కాలనీలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. 2023 నుంచి ఈ ప్రాంతంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్న ఫౌండేషన్.. ఈ ఏడాది కూడా భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించింది. చిన్నారులు, మహిళలు, యువతతో పాటు NIFD విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో అలరించారు.

NIFD విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమ ప్రాంగణం శ్రీకృష్ణ నామస్మరణతో సందడిగా మారింది. ఫౌండేషన్ చైర్మన్ కన్నెబోయిన రాము యాదవ్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ప్రజలందరితో కలిసి నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పూర్వీకులు అందించిన సనాతన ధర్మం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా అందించిన కర్మ సిద్ధాంతాన్ని జీవితంలో ఆచరించాలని సూచించారు. ముఖ్య వక్తగా శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ పీఠం అధిపతి యోగేష్ ప్రభు పాల్గొని భగవద్ధ్వజాన్ని ఆవిష్కరించారు. అనంతరం భగవద్గీత సారాంశంపై ప్రసంగించారు. దేశం, ధర్మం కోసం యువత బాధ్యతగా పనిచేయాలని, ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్‌రెడ్డి హాజరై వేడుకలను అభినందించారు.

మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ మాట్లాడుతూ.. రాము యాదవ్ గత కొన్నేళ్లుగా శ్రీకృష్ణాష్టమితో పాటు పలు హిందూ పండుగలను ఘనంగా నిర్వహిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక చైతన్యం తీసుకొస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో ఆర్కే యువ భారత్ ఫౌండేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వామి యాదవ్, BJYM నాయకులు బండారు పవన్‌రెడ్డి, కన్నెబోయిన శ్రీనివాస్, బీజేపీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, వివిధ కాలనీల అధ్యక్షులు, మహిళలు, యువత, చిన్నారులు, NIFD విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**దశ ఓయూ:** భక్తివేదాంత సంస్థ ఆధ్వర్యంలో తార్నాక విజయపురి కాలనీలో మర్రి కృష్ణ హాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల్లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు N రామచంద్రరావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కొమరయ్య ఎంఎల్సీ గారు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, స్థానిక ప్రజలు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని కృష్ణుని కృపకు పాత్రులయ్యారు.

కార్యక్రమంలో భాగంగా కీర్తనలు, శ్రీకృష్ణుడి లీలలను చాటిచెప్పే సంప్రదాయ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శ్రీకృష్ణుని దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఈ సందర్భంగా నేతలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు భక్తి వేదాంత ఇనిస్ట్యూట్ ప్రతినిధులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ బిజెపి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం

❖ *పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి*




**దశ ఓయూ:** సికింద్రాబాద్ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రెండో విడత కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ పై ప్రసంగించారు. నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరు సరైన ధ్రువపత్రాలు సమర్పించి ఓటు హక్కును పునరుద్ధరించుకునేలా పార్టీ నాయకులు వారికి సహకారం అందించాలని అన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దడంపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సమస్యల పరిష్కారం కోసం బిజెపి శ్రేణులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పోరాటాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ నియోజకవర్గ ముఖ్య నాయకులు వెంకటరమణి, సారంగపాణి, నాగేశ్వర్ రెడ్డి, వివిధ మోర్చాల ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి వ్యతిరేకంగా కదం తొక్కిన విద్యార్థులు, యువత

❖ *ర్యాలీని ప్రారంభించిన సికింద్రాబాద్ శాసనసభ్యులు పద్మారావు గౌడ్*




**దశ ఓయూ:** కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులకు కలిగిన ప్రయోజనం శూన్యమని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనలో వైఫల్యాల పై బీ. ఆర్. ఎస్. విద్యార్థి విభాగం సికింద్రాబాద్ నియోజకవర్గ శాఖ ఆద్వర్యంలో శనివారం తార్నాకలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ నిరసన కార్యక్రమాన్ని పద్మారావు గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకత్వం చేసిన హామీల్లో ఏ ప్రధాన హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ వ్యవహార శైలితో విసుగు చెందుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఫీజ్ రీయింబర్స్మెంట్ ను పట్టించుకోలేదని, దాంతో విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని అన్నారు. అదే విధంగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీ. ఆర్. ఎస్. వీ. సికింద్రాబాద్ నియోజకవర్గ మహిళా నాయకులు స్టాలిన్ , స్మితా, జెస్సీ,విజయ, పద్మ , సునంద,నేతలు సునీల్, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత తో పాటు బీ. ఆర్. ఎస్. నేతలు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లా కార్డులు ప్రదర్శించారు.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఘనంగా గురుపూజోత్సవ కార్యక్రమం





**దశ, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఘనంగా గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జి మనీ పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో గురు బాధ్యత ఎంతో ముఖ్యమైనదని భావి భారత పౌరులు సభ్య సమాజంలో సరైన దారిలో నడవడానికి గురు బాధ్యత ముఖ్యమని అలాంటి బాధ్యతలను సమాజానికి తెలియజేసిన గొప్ప గురువు సర్వేపల్లి రాధాకృష్ణ అన్నారు, నేటి విద్యార్థిని విద్యార్థులకు మహనీయుల చరిత్రతో పాటు వారి త్యాగాలను తెలియాలని ఈ సందర్భంగా అన్నారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మునిపంపులలో రూ.3.62 కోట్లతో నూతన సబ్ స్టేషన్

*సీఎం రేవంత్ రెడ్డి చే వర్చువల్ శంకుస్థాపన*

*స్థలధాత గంగుల రాజిరెడ్డికి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందన*






**దశ, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. గ్రామంలో రూ. 3 కోట్ల 62 లక్షల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసినట్లు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు.

### స్థలదాతకు అభినందనలు

ఈ సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని దానంగా ఇచ్చిన పల్లివాడ గ్రామానికి చెందిన గంగుల నర్సిరెడ్డి కుమారుడు గంగుల వెంకట రాజిరెడ్డిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.4 ఫీడర్లు వేలాది మందికి ప్రయోజనం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సబ్ స్టేషన్ నుండి మునిపంపుల, దుబ్బాక, పల్లివాడ, కక్కిరేణి అనే 4 ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేయనున్నారు. దీని వల్ల 1546 వ్యవసాయ, 2400 గృహ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ అందనుంది. అంతేకాకుండా ఎన్నారం, ఇస్కిళ్ల సబ్ స్టేషన్లపై లోడ్ తగ్గి ఆ ప్రాంత వినియోగదారులకు కూడా మెరుగైన విద్యుత్ అందనుందని తెలిపారు.




## ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ యువజన, విద్యార్థి మహాధర్నా

❖ *కాంగ్రెస్ మోసాలపై పోరుబాట.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం*

**దశ, ఇబ్రహీంపట్నం :** కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో యువజన, విద్యార్థి మహాధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విద్యార్థులకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. మహాధర్నాలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటీ) తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాణిక్యేశ్వరి నగర్‌లో రేవంత్ రెడ్డి 1000 రోజుల పాలన సంబరాలు





**దశ ఓయూ:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గం మాణిక్యేశ్వరి నగర్‌లో శనివారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించాయి. నియోజకవర్గ ఇన్‌చార్జి, కాంగ్రెస్ నాయకుడు ఆదం సంతోష్ ఆదేశాల మేరకు డీసీసీ ప్రధాన కార్యదర్శి, వద్దే ఓబన్న ఉత్సవ కమిటీ సభ్యుడు గండికోట కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.
మాణిక్యేశ్వరి నగర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి గండికోట కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలకు స్వయంగా మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక చిరు వ్యాపారులను కలిసి స్వీట్లు పంపిణీ చేశారు.

### బైక్ ర్యాలీ

వేడుకల్లో భాగంగా గండికోట కుమార్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మాణిక్యేశ్వరి నగర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ వారాసిగూడ, నామాలగుండు, సీతాఫల్‌మండి మీదుగా లాలాపేటలోని అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేశారు.

### ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఈ సందర్భంగా గండికోట కుమార్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ 1000 రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయని, అందుకే పాలన సంబరాల్లో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్, కొడుదల నరసింహ, గండికోట వెంకటేష్, ఆలకుంట వెంకటేష్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## భూ భారతిపై బీజేపీ మహా దీక్ష

❖ *ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో బీజేపీ నేతల నిరసన*




**దశ ఓయూ:** భూ భారతి అంశంపై బీజేపీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో శనివారం మహా దీక్ష నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు, శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి పోతగాని గోపాల్‌గౌడ్ దీక్షకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు చంద్రమౌళి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ యోగేశ్వర్‌రెడ్డి, రాజిరెడ్డి, గందమల్ల గోపి, నవీన్ చింటూ, మంజుల వాణి తదితర నాయకులు పాల్గొన్నారు.



## రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఆధ్వర్యంలో నకిరేకల్‌కు భారీగా కాంగ్రెస్ శ్రేణులు

❖ *200 కార్లతో ప్రజా వికాస సభకు భారీ వాహన శ్రేణి*

**దశ సూర్యాపేట ప్రతినిధి :** నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే ప్రజా వికాస సభకు సూర్యాపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 200 కార్లతో భారీ వాహన శ్రేణి నకిరేకల్‌కు బయలుదేరింది. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, డీసీసీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాదిలతో కలిసి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణను చూసి బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేక నిరసనలకు దిగుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలను విస్మరించిన నాయకులు.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణకు నకిరేకల్ ప్రజా వికాస సభకు తరలివచ్చిన భారీ జనసందోహమే నిదర్శనమని రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి పేర్కొన్నారు.

## హబ్సిగూడ ప్రభుత్వ పాఠశాలలో అంబరాన్నంటిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**దశ ఓయూ:** హబ్సిగూడలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా, ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు విశేషంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ. పుష్ప, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం విజయ్ కుమార్ సమక్షంలో వేడుకలు కోలాహలంగా సాగాయి. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో నిరంతరం శ్రమిస్తున్న ఉపాధ్యాయులు ఉపేంద్ర, భాగ్యరేఖ, రజని, వీరనాగిరెడ్డి, జ్యోతి, శైలజ, సుజాత, కల్యాణి, అనిత, కుమారి, భారతి తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని తమ సందేశాలను అందించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్న ఆచార్యుల సేవలు అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమానంతరం విద్యార్థులు తమ ప్రియమైన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేసి వారి ఆశీస్సులు తీసుకున్నారు.



## బీజేపీ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా అంబాల రాజేశ్వరరావు



**దశ, ఓయూ:** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గా అంబాల రాజేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె లక్ష్మణ్ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భారతీయ జనతా పార్టీని, ఎస్సీ మోర్చాను బలోపేతం చేసేందుకు చురుకైన పాత్ర పోషిస్తానని తెలిపారు.తన నియామక పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి, ఎంపీ,డాక్టర్ లక్ష్మణ్ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు గుండగోని భరత్ గౌడ్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు నవీన్ లకు కృతజ్ఞతలు తెలిపారు.